క్లుప్తంగా

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న మదన్‌మోహన్

సూర్యాపేట : విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని లయన్స్‌క్లబ్ 320 ఈ డిస్ట్రిక్ గవర్నర్ రేపాల మదన్‌మోహన్ అన్నారు. గురువారం పట్టణంలోని చందన నర్సింగ్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన యువ వికాస్ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పూర్ణ శశికాంత్, మిరియాల సుధాకర్, గుండా లక్ష్మయ్య, అనంతరాములు, కె.లక్ష్మారెడ్డి, చందనా కళాశాల డైరెక్టర్ కె.మధుసూదన్‌రెడ్డి, గుండా రమేష్, దోసపాటి గోపాల్ పాల్గొన్నారు.

ఎంపీ చామలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రేఖ



ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డికి శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బోయలపల్లి రేఖ

సూర్యాపేట : భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బోయలపల్లి రేఖ గురువారం ఢిల్లీలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో పాటు రాజకీయ ప్రయాణం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు.

మున్సిపాలిటీలో రెస్క్యూ టీం ఏర్పాటు



రెస్క్యూ టీమ్‌తో మున్సిపల్ కమిషనర్

సూర్యాపేట అర్బన్ : వర్షం కారణంగా ముందస్తు చర్యల్లో భాగంగా పట్టణంలో రెస్క్యూ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ హన్మంతరెడ్డి గురువారం తెలిపారు. ఈ టీంలో 10మంది కార్మికులను, 1జవాన్‌ను, జేసీబీని ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. పట్టణ వాసులకు లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఉంటే హెల్ప్‌లైన్ నంబర్ 8684220049కు సమాచారం ఇవ్వాలన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న గ్రామస్తులు

నూతనకల్ : తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మిగిలిన గునగంటి మహేష్‌కు గ్రామానికి చెందిన పులుసు సంతోష్‌గౌడ్, సతీష్‌గౌడ్ గురువారం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం ఇటీవల మృతి చెందిన గునగంటి సుజాత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట పులసరి వెంకటముత్యం, బాలగాని మహేష్, కూసు రమేష్, సామ శ్యాంసుందర్‌రెడ్డి, బాణాల విజయ్ ఉన్నారు.

ఆపరేటర్ లేక నిలిచిన ధరణి రిజిస్ట్రేషన్లు



ఆపరేటర్ లేకపోవడంతో రిజిస్ట్రేషన్‌ల కోసం వచ్చి పడిగాపులు పడుతున్న రైతులు

ఆత్మకూర్(ఎస్) : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వచ్చిన రైతులు రెండు రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రిజిస్ట్రేషన్ చేసేందుకు కంప్యూటర్ ఆపరేటర్ లేకపోవడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఇక్కడ ఉన్న ఆపరేటర్‌ను పది రోజుల క్రితం బదిలీ చేయగా కోదాడ నుంచి ఇక్కడికి ఓ ఆపరేటర్ బదిలీపై వచ్చారు. కాగా తాను ఇక్కడ పనిచేసేందుకు ఆసక్తి చూపకపోవడంతో రెండు రోజులుగా విధులకు రావడం లేదు. దీంతో రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకొని కార్యాలయానికి వచ్చిన రైతులు పొద్దస్తమానం పడిగాపులు కాస్తూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ అమీన్‌సింగ్‌ను వివరణ కోరగా.. ఇటీవల బదిలీపై వచ్చిన ఆపరేటర్ విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదని, ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానని వెల్లడించారు.

ఆశాజనకంగా వానాకాలం సాగు

- మూడు రోజులుగా కురుస్తున్న జల్లులు
- పంటలకు ప్రాణం పోసిన వర్షం
- ఊపందుకున్న వ్యవసాయ పనులు

పెన్‌పహాడ్ : మూడు రోజులుగా కురిసిన వర్షాలకు వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. పత్తి పంటలు దెబ్బతింటున్న తరుణంలో వర్షాలు కురవడంతో పంటలకు ప్రాణం పోసినట్లయింది. వర్షం ఎప్పుడు వస్తుందా అని నిత్యం ఆకాశం వైపు ఎదురుచూస్తున్న సమయంలో వర్షాలు పడడంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతుంది. మండలంలోని అన్ని గ్రామాల్లో వర్షాలు కురుస్తున్నందున వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

పత్తి సాగుకే ప్రాధాన్యం..

మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు పత్తి పంటకే ప్రాధాన్యం ఇస్తున్నారు. మండలంలోని సింగారెడ్డిపాలెం, మాచారం, అనాజీపురం, మహ్మదాపురం, ధర్మాపురం, భక్తాళాపురం, గాజులమల్కాపురం తదితర గ్రామాల్లో 1890ఎకరాల్లో పత్తి పంట, పెసర్లు 30ఎకరాలు, కంది 50ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం వరిసాగు లెక్క తెలాల్సి ఉందన్నారు.



అనాజీపురంలో సాగు చేసిన పత్తి పంట

రైతుల్లో చిగురించిన ఆశలు..

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా రైతుల్లో ఆశలు చిగురించాయి. గత 20 రోజుల నుంచి వర్షాల జాడలేదు. ఈ క్రమంలో జులైలో మూడు సార్లు వర్షాలు కురవడంతో పంటలకు ప్రాణం పోసినట్లయింది. దీంతో రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. నాలుగు రోజుల నుంచి పత్తి పంటల్లో కలుపు తీసే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

పంటలకు ప్రాణం పోసినట్లయ్యింది

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పత్తి పంటలకు ప్రాణం పోసినట్లయ్యింది. వర్షాల ఆధారిత పంటలు సాగు చేస్తున్నాం. 5ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను. ప్రస్తుతం కురిసిన వర్షాలకు పంట చిగురించింది.

– అన్నమేరి, మహిళా రైతు, అనాజీపురం

అధికారుల సూచనలు పాటించాలి



వివిధ పంటల ఎదుగుదలకు ఎరువుల వాడకంపై వ్యవసాయ అధికారులు ఇచ్చే సలహాలు, సూచనలు పాటించాలి. అత్యధికంగా యూరియా వాడకం వల్ల దిగుబడి కోల్పోయే అవకాశం ఉంది. రైతులు పంటల సాగులో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వ్యవసాయ అధికారులను సంప్రదించాలి. అధికారులు తెలిపారు.

– అనిల్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి

ప్రజల సహకారంతోనే పట్టణ అభివృద్ధి సాధ్యం

సూర్యాపేట అర్బన్ : ప్రజల సహకారంతోనే పట్టణ అభివృద్ధి సాధ్యమవుతుందని మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100రోజుల పట్టణ ప్రణాళికలో భాగంగా గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 44వ వార్డులో మున్సిపల్ అధికారులతో కలిసి వనమహోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, చెత్తను వేరు చేయడం, మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం వంటి చిన్నచిన్న చర్యలే మహా మార్పులకు దారితీస్తాయని అన్నారు. ప్రభుత్వ మిషన్‌లు, మున్సిపల్ సిబ్బంది ఎంతగా కృషి చేసినా, ప్రజల సహకారం లేకపోతే అభివృద్ధి ఫలవంతం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో శుద్ధత పట్ల చైతన్యం పెరిగిందన్నారు. 100రోజుల ప్రణాళిక విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యమే కీలకమని స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ విధిగా తమ ఇంట్లో, పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి వాటి పరిరక్షణ కోసం కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, వార్డు స్థాయి సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, యువత, ప్రజాప్రతినిధులు పాల్గొని 100రోజుల ప్రణాళికలో చేపట్టబోయే కార్యక్రమాలను వివరించారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా ఇంటికి 6మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం ప్రజలతో చర్చించి స్థానిక సమస్యలను గుర్తించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్, ఫ్లోర్‌లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఏఈ తిరుమలయ్య, ఆర్‌పిలు గౌసుద్దీన్, మనోజ్, యాదగిరి, టీఎంసీ శ్వేత, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, సయ్యద్ సమ్మి, తదితరులు పాల్గొన్నారు.



వనమహోత్సవంలో భాగంగా మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి

యూరియా పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవు

- జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి

నూతనకల్ : రైతులకు సకాలంలో సరఫరా చేయాల్సిన యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించి కృత్రిమ కొరత సృష్టిస్తే దుకాణదారులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ దుకాణాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు సాగు చేసిన పంటలకు అనుగుణంగా సరిపడా యూరియా అందుబాటులో ఉందని ఆయన తెలిపారు. రైతులు ముందస్తుగా అధిక మొత్తంలో కొనుగోలు చేయరాదని, అవసరం మేరకే కొనుగోలు చేయాలని సూచించారు. యూరియా అధికంగా వాడడంతో పంటలకు తెగుళ్లు, పురుగుల ఉధృతి పెరిగి దిగుబడులు తగ్గుతాయన్నారు. రైతులు నానో యూరియా వాడడంతో దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా షాపుల్లోని స్టాక్, విక్రయాల రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఆయన వెంట ఏడీఏ రమేష్‌బాబు, మండల వ్యవసాయ అధికారి మురళీ తదితరులు ఉన్నారు.



నూతనకల్ : ఎరువుల దుకాణంలో యూరియా స్టాక్‌ను పరిశీలిస్తున్న డీఏఓ శ్రీధర్‌రెడ్డి



ఆత్మకూర్(ఎస్) : యూరియా పంపిణీని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారిణి

యూరియా కోసం ఇబ్బందులు పడొద్దు

ఆత్మకూర్(ఎస్) : రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడొద్దని, మండలంలో సరిపడా యూరియా అందుబాటులో ఉందని మండలం వ్యవసాయ అధికారిణి దివ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో యూరియా స్టాక్‌ను, పంపిణీని ఆమె పరిశీలించి మాట్లాడారు. ఆత్మకూరు, ఏపూర్, నెమ్మికల్ పీఏసీఎస్ కేంద్రాలతో పాటు ఆత్మకూర్, నెమ్మికల్ ఎన్‌డీసీఎంఎస్ కేంద్రాలలో మంగళతండా, ఆత్మకూరు రైతు ఉత్పత్తిదారుల సంఘం కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా యూరియాను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



నూతనకల్ : ఎర్రపహాడ్ క్రాస్‌రోడ్డు వద్ద మొక్క నాటుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

నూతనకల్ : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం వనమహోత్సవంలో భాగంగా మండల పరిధిలోని ఎర్రపహాడ్ శివారులోని 365 జాతీయ రహదారి వెంట మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అనంతరం యడవెల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గుండ్లసింగారం ఆవాసంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రీచార్జ్ బోర్‌వెల్‌ను, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను, మండల ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. భూగర్భజలాలను పెంపొందించడం కోసం రీచార్జ్ బోర్‌వెల్ పద్ధతి ఎంతగానో దోహదపడుతుందని, వర్షపు నీరును వృథా కాకుండా రీచార్జ్ పద్ధతి ద్వారా బోర్‌వెల్‌లోకి పంపడంతో బోర్‌లో అధిక నీరు లభ్యమవుతుందన్నారు. కస్తూరిబా గాంధీ పాఠశాలలో పరిసరాలను, వంట గదిలో సామగ్రిని పరిశీలించారు. పదో తరగతి క్లాస్‌రూమ్‌లోకి వెళ్లి విద్యార్థులను పలు ప్రశ్నలు అడగగా విద్యార్థులు సరైన సమాధానం చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల పేర్లు, బొమ్మలు చూపెట్టి వాటి పేర్లను అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలో మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీని పరిశీలించారు. ఎరువుల దుకాణంలో స్టాక్ వివరాలు, విక్రయాల వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళా రైతుతో తమకు కావాల్సిన ఎరువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో భూ భారతిపై నిర్వహించిన సమావేశంలో పాల్గొని రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తులు అర్జీలకు ఇచ్చిన నోటీసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయానికి వచ్చిన లింగంపల్లి, పెదనెమిల రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. జెడ్పీ, ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించడంతో పాటు ఉపాధ్యాయుల బోధన విధానాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఆర్‌డీఏ పీడీ అప్పారావు, డీపీఓ నారాయణరెడ్డి, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీఓ సునీత, వ్యవసాయ అధికారి మురళీ, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్క నాటి సంరక్షించాలి

మద్దిరాల : గ్రామాల్లో ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జెడ్పీ సీఈఓ అప్పారావు అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని పోలుమల్ల గ్రామంలో గురువారం మొక్క నాటి మాట్లాడారు. మొక్కలు జీవికోటి ప్రాణాలకు మూలధారమన్నారు. మొక్కలను మనం రక్షిస్తే అవి మనల్ని పీల్చడానికి కావాల్సిన గాలిని అందించి రక్షిస్తాయన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ నారాయణరెడ్డి, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, ఏపీఓ గుండు వెంకన్న, ఈసీ చారి, టీఏ మురళి, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.



మద్దిరాల : పోలుమల్లలో మొక్క నాటుతున్న జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఎల్‌పీఓ, ఎంపీడీఓ

పర్యావరణాన్ని కాపాడాలి

తుంగతుర్తి : ప్రతిఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలని తహసీల్దార్ దయానందం అన్నారు. వనమహోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని రోడ్డు వెంట మొక్కలు నాటి ఆయన మాట్లాడారు. మొక్కలు నాటడంతో పాటు వాటి రక్షణ కూడా బాధ్యత తీసుకోవాలన్నారు. నాటిన ప్రతి మొక్క బతికేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ సందీప్, ఏపీఓ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



తుంగతుర్తిలో రోడ్డు వెంట మొక్క నాటుతున్న తహసీల్దార్ దయానందం, ఎంపీఓ, ఏపీఓ

పోలింగ్ బూత్‌ల సర్దుబాటుపై సమీక్ష

తుంగతుర్తి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల సర్దుబాటు జరగాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన వివిధ రాజకీయ పార్టీల నాయకులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. త్వరలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగే ఆకాశం ఉందన్నారు. గతంలో నియోజకవర్గ 327 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, ప్రస్తుతం 330 బూత్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి రాజకీయ పార్టీ నాయకుడు బూత్‌కు ఒక ఏజెంటును ఏర్పాటు చేసుకొని నూతన ఓటర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ దయానందం, వివిధ పార్టీల నాయకులు తాటికొండ సీతయ్య, బుర్ర శ్రీనివాస్, పల్ల సుదర్శన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ రాంబాబు

జీఓ 282ను రద్దుచేయాలని ఆర్డీఓకు వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సూర్యాపేట : తెలంగాణ ప్రభుత్వం 8గంటల పని స్థానంలో 10గంటలు పనిచేయాలని తీసుకొచ్చిన జీఓ 282ను వెంటనే రద్దు చేసి 8గంటల పని దినాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ షాప్ వర్కర్స్ అండ్ బట్టలషాపు గుమస్తాల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆర్డీఓ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించి ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు వెంపటి గురూజీ మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లో సైంటిఫిక్‌గా, ఆరోగ్య రీత్యా 8గంటల పనివిధానం ఐఎల్‌ఓ తీర్మాణం మేరకు అమల్లో ఉందన్నారు. ఇప్పటికే కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతూ కనీస వేతనాలకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో క్లాత్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కందుల వెంకన్న, ప్రధాన కార్యదర్శి కొండూరు వెంకన్న, నాయకులు జమాల్, మహమూద్, శివ, మహేష్, చక్రీ, మహిళా నాయకురాళ్లు వి.మంజుల, ఎండీ.రేష్మాబేగం, సీహెచ్ శివ, జె.రేణుక, టి.చంద్రకళ, జి.పద్మ, శోభ పాల్గొన్నారు.

చైతన్య యాత్రలను జయప్రదం చేయాలి

సూర్యాపేట అర్బన్ : కల్లు గీత కార్మికుల హక్కుల కోసం పోరాడి అమరులైన సంఘం నాయకులను స్మరిస్తూ నిర్వహించే చైతన్య యాత్రలను జయప్రదం చేయాలని కేజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పట్టణంలోని వృత్తి సంఘాల భవనంలో నిర్వహించిన ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గీత కార్మికుల సంక్షేమానికి నిధుల కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 2న బొలగాని పుల్లయ్య 37వ వర్ధంతి నుంచి 18న సర్దార్ సర్వాయి పాపన్న 375వ జయంతి వరకు అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర ప్రతి సంవత్సరం లాగానే అన్ని జిల్లాల్లో సభలు సమావేశాలు జరిపి అమరవీరుల త్యాగాలను నేటి తరానికి తెలపాలన్నారు. బైక్ ర్యాలీలు, పాటల పోటీలు, ఆటల పోటీలు, రక్తదాన శిబిరాలు, వ్యాస రచన పోటీలు, రోగులకు పండ్లు పంపిణీ, తదితర కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మడ్డి అంజిబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బగాని భిక్షం, తుమ్మల సైదయ్య, గుణగంటి కృష్ణ, సహాయ కార్యదర్శి బత్తుల జనార్దన్, బోడపట్ల జయమ్మ, అన్నపూర్ణ, కృష పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

నాగారం : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో సంయుక్తంగా గురువారం మండల తహసీల్దార్ హరికిషోర్‌శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూఎస్‌పీసీ ఉపాధ్యాయ సంఘం నాయకులు మాట్లాడారు. ఉపాధ్యాయ అన్ని క్యాడర్లలో బదిలీలు పదోన్నతుల షెడ్యూలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీఓ నం 25ను సవరించి ప్రతి ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు పెన్షనరీ బెనిఫిట్స్ వెంటనే విడుదల చేయాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. ఏకీకృత సర్వీసు నిబంధనల ప్రకారం డీఈఓ, ఎంఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, 5,571 ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంల పోస్టులను మంజూరు చేయాలని, మొత్తం 30 డిమాండ్లతో కూడి వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో యూఎస్‌పీసీ ఉపాధ్యాయ నాయకులు వర్దెల్లి మల్లయ్య, బి.శ్రీనివాస్, పి.నాగు, బి.మహేష్, సీహెచ్ రవి, శ్యాంసుందర్‌రెడ్డి, పి.రమేష్, ఉమ, రాందాస్‌నాయక్ పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగిఉండాలి

నాగారం : సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సామాజిక ఆరోగ్య అధికారి మాలోతు బిచ్చునాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఫణిగిరి జెడ్పీహెచ్‌ఎస్, మేరీ మదర్ పాఠశాలల్లో విద్యార్థులకు కీటక జనిత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ విమలమ్మ, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మక్సూద్, సూపర్‌వైజర్ రామచంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ సరస్వతీ, కళ్యాణి, ఉపాధ్యాయులు, ఆశకార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి వైద్యపరీక్షలు

తిరుమలగిరి : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ సిబ్బందికి వైద్య శాఖ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమిషనర్ మున్వర్‌అలీ, వైద్యాధికారిణి మల్లెల వందన, పల్లె డాక్టర్ సమత, సూపర్‌వైజర్ స్వరూపాకుమారి, హెల్త్ అసిస్టెంట్లు నర్సింహారెడ్డి, విజయ్, రాజు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



నాగారం : సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌ఓ బిచ్చునాయక్

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

అర్వపల్లి : సీజనల్ వ్యాధుల దృష్ట్యా ప్రతిఒక్కరూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల వైద్యాధికారి డాక్టర్ బి.నగేష్‌నాయక్ కోరారు. గురువారం మండలంలోని కుంచమర్తి గ్రామంలో ఎన్‌సీడీ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎం.బిచ్చునాయక్, ఎంఎల్‌హెచ్‌పీ గౌతమి, ఏఎన్‌ఎం టి.నాగరాణి, ఆశా కార్యకర్త పగిళ్ల విజయ, ఉగ్గం లింగరాజు, జానిపాష పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

ఆత్మకూర్ (ఎస్) : చదువును మధ్యలోనే నిలిపిన వారు ఇంటివద్దనే ఉండి పదోతరగతి, ఇంటర్ చదివే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూర్ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ శ్రవణ్‌కుమార్ గురువారం తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ఈ నెల 31 వరకు స్టడీ సెంటర్‌లో సంప్రదించాలని తెలిపారు. ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో చేరేవారు ఆధార్‌కార్డు, టీసీ, కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌ఫొటోలతో స్టడీసెంటర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

మూసీ దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సూర్యాపేట : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా మూసీ ప్రాజెక్టులో 1427క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నందున శుక్రవారం ఉదయం మూసీ ప్రాజెక్ట్ రెండు క్రస్ట్ గేట్ల నుంచి 1260 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయనున్నట్లు ఇరిగేషన్ 1వ నంబర్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గురువారం తెలిపారు. మూసీ దిగువన ఉన్న ప్రాంత ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని, మూసీ నదిలోకి చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు.

వైభవంగా మాస కల్యాణం

సూర్యాపేట : పట్టణంలోని బొడ్రాయి బజార్‌లో గల శ్రీవేదాంత భజన మందిరంలో గురువారం సీతారామచంద్ర స్వామి వారికి ప్రత్యేక పంచామృత అభిషేకంతో పాటు మాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర అధ్యక్షుడు రాచర్ల వెంకటేశ్వరరావు, మందిర ప్రధాన అర్చకుడు ధరూరి సింగరాచార్యులు మాట్లాడారు. ప్రతి నెల ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకంతో పాటు కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కల్యాణం అనంతరం భక్తులందరికీ అన్నప్రసాదం అందించారు. కార్యక్రమంలో మందిర కార్యదర్శి నకిరికంటి నాగరాజు, కోశాధికారి సోమా అశోక్, ఈగ వెంకటేశ్వర్లు, సోమా సుమన్, బీరవెల్లి రామ్మూర్తి, సోమా రవి, వాసా కృష్ణ, శీలా శంకర్, ఇల్లెందుల నవీన్, అంతటి శ్రీను, ఓరుగంటి శేఖర్, ధరూరి రాఘవాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు



సభ్యత్వం అందజేస్తున్న అనిల్‌కుమార్

పెన్‌పహాడ్ : ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, కేజీబీవీ, పొట్లపహాడ్, అన్నారం, దోసపహాడ్ జెడ్పీ ఉన్నత పాఠశాల, అనాజీపురం ఆదర్శ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏలు వెంటనే విడుదల చేయాలని కోరారు. హెల్త్‌కార్డుల ద్వారా మెరుగైన చికిత్స అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చిలక రమేష్, మండల అధ్యక్షుడు కె.వీరేంద్ర, ప్రధాన కార్యదర్శి బి.రాంజీ, రాంబాబు, వెంకటేశ్వర్లు, విజయ్, సత్యనారాయణ, వెంకన్న, సతీష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాగుతో అధిక దిగుబడులు

పెన్‌పహాడ్ : వరిసాగులో ఆధునిక పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని అనాజీపురం గ్రామంలో డ్రమ్‌సీడర్ పద్ధతిలో వరిసాగు చేసిన రైతుల పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్రమ్‌సీడర్ పద్ధతిలో వరిసాగు చేయడంతో రైతులు ఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు. వరిలో కలుపు నివారణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో ఏఈఓ మురళీ, రైతులు చిన్నబాబు, మట్టయ్య, దామోదర్‌రెడ్డి, రమణారెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏఓ అనిల్‌కుమార్

విద్యుదాఘాతంతో గేదె మృతి

తుంగతుర్తి : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ గేదె మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని సంగెం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వంగూరి ముత్తయ్య తన గేదెను తన వ్యవసాయ క్షేత్రంలో మేతకు వదలగా మేతమేసుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ తీగకు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు కోరారు.